క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి

నాగర్‌కర్నూల్‌రూరల్‌: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, జెడ్పీ చైర్‌పర్సన్‌ శాంతకుమారి అన్నారు. నాగర్‌కర్నూల్‌ మండలం మంతటిలో గురువారం గ్రామపంచాయతీ భవనం, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌, రైతువేదిక, వైకుంఠధామాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌డీపీ, జిల్లా పరిషత్‌ నిధులు రూ.44 లక్షలతో పాటు మరో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీశైలం, సర్పంచ్‌ నాగలక్ష్మి, వార్డు సభ్యుడు నాగయ్య పాల్గొన్నారు.

కార్యాలయాలు ముస్తాబు

తెలకపల్లి: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల తహసీల్దార్‌, ఎంపీడీఓ, కాంప్లెక్స్‌ కార్యాలయాలను ముస్తాబు చేశారు. త్రివర్ణ జెండాను ఎగురవేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రంగురంగుల కాగితాలను అతికించారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

నాగర్‌కర్నూల్‌రూరల్‌: మండలంలోని మంతటిలో వెలిసిన మహబూబ్‌ సుభాని దర్గాను మాజీ శాసనసభ్యులు మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్‌ శాంతకుమారి, సర్పంచ్‌ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

25ఎన్‌జికెఎల్‌102 దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేస్తున్న మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్‌రెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కోడేరు: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఏసీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిగా కావలి వెంకటయ్య

చారకొండ: దివ్యాంగుల జాతీయ వేదిక కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య నియమాకం అయ్యారు. గురువారం హైదరాబాద్‌లో దివ్యాంగుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ ఇండియా) కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు తూడు రాజేందర్‌ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌ వెంకటయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు.


భారత్‌బంద్‌ను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్‌: దేశవ్యాప్త కార్మికుల సమ్మెను ఫిబ్రవరి 16న భారత్‌బంద్‌ నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ నాయకుడు మారేడు శివశంకర్‌, సీఐటీయూ నాయకుడు ఆర్‌ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 4న నిర్వహించనున్న సదస్సు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు శ్రీనివాసులు, హమాలీ సంఘం నాయకులు దేశమోని అంజి, సెంట్రింగ్‌ యూనియన్‌ నాయకులు వాడాల బాలపీరు, పర్వతాలు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్షేత్ర పర్యటన

కొల్లాపూర్‌ రూరల్‌: మండలంలోని పీజీ కళాశాల సోషల్‌ వర్క్‌ విద్యార్థులు గురువారం అమరగిరి క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా చెంచుల జీవన విధానం, వారి సంస్కృతి సంప్రదాయాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్య అతిథిగా పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ మార్క్‌పోలోనియస్‌ హాజరై మాట్లాడారు. అమరగిరి పరిసరాలు పర్యాటక కేంద్రానికి అనువుగా ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధి అమృత్‌, సోషల్‌ వర్క్‌ విభాగం అధ్యాపకులు దేవరాజు, రమణ, డాక్టర్‌ సాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అయోధ్యలో రామచంద్రస్వామి ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

కల్వకుర్తిరూరల్‌: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని నాగర్‌కర్నూల్‌ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కల్వకుర్తి మండలంలోని గుండూరు దర్గాను గురువారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా ఉర్సును వైభవంగా నిర్వహించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. ఆయన వెంట సంతోష్‌కుమార్‌, రామేశ్వర్‌రావు, బాలెమియా తదితరులు ఉన్నారు.



అచ్చంపేటలో



కొల్లాపూర్‌లో



తెలకపల్లిలో..



చారకొండలో



అమ్రాబాద్‌లో..



కోడేరులో..



బల్మూర్‌లో..

ఓటు వజ్రాయుధం



మన్ననూర్‌లో..

• ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



నాగర్‌కర్నూల్‌లో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాంరెడ్డి

కందనూలు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని ఆర్డీఓ రాంరెడ్డి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో స్థానిక కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దేశభవిష్యత్తు ఓటరు చేతిలో ఇమిడి ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డీఈఓ గోవిందరాజులు, ఇంటర్‌ విద్య నోడల్‌ అధికారి వెంకటరమణ, డీపీఓ కృష్ణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి టౌన్‌: పట్టణంలోని తహసీల్దార్‌ కార్యాలయం నుంచి పాలమూరు చౌరస్తా వరకు కళాశాల విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీను సీనియర్‌ ఓటర్లను సన్మానించారు. అలాగే కల్వకుర్తి మున్సిపల్‌ కార్యాలయంతో కమిషనర్‌ అక్షిత్‌ కుమార్‌, పాలమూరు చౌరస్తాలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్‌ ఇబ్రహీం, ఆర్‌ఐ రవూఫ్‌, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో ఆర్డీఓ గోపిరాం విద్యార్థులతో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు వివిధ కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటరు కార్డులను పంపిణీ చేశారు. తహసీల్దార్‌ పాండు, ఎంఈఓ రామారావు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్‌ చౌరస్తా వరకు రెవెన్యూ ఉద్యోగులతో పాటు పలువురు నాయకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్‌ శ్రీకాంత్‌లు హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పీజీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్స్‌ రామరాజుయాదవ్‌, మార్క్‌పోలోనియస్‌లు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, అరవిందు, ఆనంద్‌, ప్రభాకర్‌, లక్ష్మీనర్సమ్మ, పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌ నుంచి పాత బస్టాండ్‌ వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ హిమబిందు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అర్జున్‌గౌడ్‌, శ్రీధర్‌, ఆర్‌ఐ హనుమంతు, ఉమాదేవి, రాము పాల్గొన్నారు.

బల్మూర్‌: మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి అధికారులు మానవహారం నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ సలీమొద్దిన్‌, డీటీ వరుణనాయక్‌, ఆర్‌ఐ పద్మ, హెచ్‌ఎం రాంసింగ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌ నుంచి అంబేడ్కర్‌ సర్కిల్‌ వరకు విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులు, అధికారులు మానవహారంగా ఏర్పాటు అయ్యి ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్‌ ప్రమీల, డీటీ విద్యాధరి, ఆర్‌ఐ నళి రెవెన్యూ అధికారులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్‌ స్టేషన్ల పరిధిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట అధికారులు, బీఎల్‌ఓలు, ఓటర్లు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞలు చేశారు. ఈ సందర్భంగా సీనియర్‌ సిటిజన్లను సన్మానించారు. అనంతరం పోలింగ్‌ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ తబితారాణి, డీటీ సరస్వతి, ఎమ్మార్‌ఐ సుజాత, ఏఆర్‌ఐ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నిరంజన్‌రెడ్డి, బీఎల్‌ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

మన్ననూర్‌: స్థానిక మహిళలకు అమ్రాబాద్‌ జెడ్పీటీసీ డాక్టర్‌ అనురాధ ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ సంబు శోభ, నారమ్మ, బీబి తదితర మహిళలు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్‌ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ గీతాంజలి, తహసీల్దార్‌ ఉమ, హెచ్‌ఎం శేఖర్‌, ఎమ్మార్‌ఐ సీతారాంనాయక్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ ప్రమీల, ఎంపీడీఓ గంగమోహన్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో అధికారులు ఓటు హక్కుపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ సైదులు, ఎంపీడీఓ బాలచంద్రసృజన, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ సురేందర్‌, బుమ్మలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్‌: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ శ్రీకాంత్‌, అధ్యాపకులు రాధ, జూనియర్‌ అసిస్టెంట్‌ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ రవికుమార్‌, డీటీ శ్రీనివాస్‌, హెచ్‌ఎంలు నాయకులు తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో..



పెంట్లవెల్లిలో..



ఉప్పునుంతలలో..



తాడూరులో..



లింగాలలో..



వెల్దండలో

చదువుపై బాలికలకు అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్‌ విద్యార్థినులు

తాడూరు: మండలంలోని యత్మతాపూర్‌లో కేవీకే పాలెం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం రావేఫ్‌ విద్యార్థినులకు చదువుపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం నేషనల్‌ గర్ల్స్‌ డెవలప్‌మెంట్‌ మిషన్‌ కార్యక్రమం ఏర్పాటు చేసిందని రావేఫ్‌ విద్యార్థులు తెలిపారు. 2008వ సంవత్సరంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. డ్రాయింగ్‌ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రావేఫ్‌ విద్యార్థినులు నివేదిత, సింధూర, నవత, రమ్య, ప్రవళిక, సానియా, హెచ్‌ఎం శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్‌ కేంద్రాలు ఏర్పాటు

నాగర్‌కర్నూల్‌: ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్‌ కేంద్రాలను గురువారం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్‌ పి.ఉదయ్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్‌ ఎంపీడీఓ, బిజినేపల్లి తహసీల్దార్‌, తాడూరు తహసీల్దార్‌ కార్యాలయాల్లో ఈనెల 31వ తేదీ వరకు తాత్కాలికంగా ఆధార్‌ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోజు ఉదయం 10నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక ఆధార్‌ కేంద్రాలు కొనసాగుతాయని.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యత లోపించొద్దు

అమ్రాబాద్‌: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు నాణ్యతగా ఉండాలని జెడ్పీ సీఈఓ ఉష సూచించారు. అమ్రాబాద్‌ మండల పరిషత్‌ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. కూలీలందరికీ పనులు కల్పించాలని సూచించారు. నర్సరీల పెంపకంపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి పనులను గుర్తించాలని తెలిపారు. ఎంపీడీఓ రామ్మోహన్‌, ఎంపీఈఓ వెంకటయ్య, ఏపీఓ రఘు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్‌: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టర్‌ ఏఓ హనుమంతునాయక్‌కు ట్రాన్స్‌పోర్టు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పబ్లిక్‌ ప్రైవేట్‌ ట్రాన్స్‌పోర్టు ఫెడరేషన్‌ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, కార్యదర్శి రామయ్యలు మాట్లాడుతూ భారత న్యాయ సంహిత చట్టంలోని 106 సెక్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రవాణ రంగ కార్మికుల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందని వివరించారు. నెలకు రూ.4500 జీవన భృతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్‌, సుభాష్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం పంటతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాడూరు: ఆయిల్‌పాం పంట సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఐఐఓపీఆర్‌టీఎస్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ రామచంద్రుడు అన్నారు. గురువారం మండలంలోని మేడిపూర్‌లో ఆయిల్‌పాం పంట సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డి సాగు చేసిన తోటలో యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో వివరించారు. జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి సురేష్‌ ఉద్యానశాఖ ద్వార ఆయిల్‌పాం పంటలకు ఇచ్చే రాయితీలను తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన అధికారులు కె మహేశ్వరి, ఎం లక్ష్మణ్‌, పి ఇంద్రాన, ఫణికుమార్‌, అన్ని మండలాలకు సంబంధించిన క్లస్టర్‌ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు



స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని సీతారామ స్వామి దేవాలయంలో పుష్యమాసం పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నిత్య విష్ణుసహస్రనామ పారాయణ కమిటీ సభ్యులు, సాయి భక్తులు భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్‌ అయ్యంగార్‌, కమిటీ సభ్యులు అర్థం రవీందర్‌, గొల్ల రాములు, మల్లేష్‌, గిరి, శారద, పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని శ్రీముఖ దుర్గాదేవి ఆలయంలో గురువారం టీటీడీ హిందూ ధార్మిక ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం ఉమాపతి ఆచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. సరస్వతి, రాధిక, శ్రీదేవి, పుష్పమ్మ, రామస్వామి పాల్గొన్నారు.

ఏఈకి ఫిర్యాదు

లింగాల: వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుకు విద్యుత్‌ సిబ్బంది డబ్బులు డిమాండ్‌ చేస్తున్నారని మండలంలోని బాకారం గ్రామానికి చెందిన రైతులు జలగరి చిన్న నిరంజన్‌, నడిపి నిరంజన్‌, బుద్దటి నాగయ్య, బాలయ్యలు గురువారం ఏఈ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. ఒక్కో డీడీకి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.28 వేలు ఇచ్చామని పేర్కొన్నారు. ఫిట్టింగ్‌ చార్జీ అదనంగా చెల్లించాలని, దీంతో పాటు మరింత ఖర్చు అవుతుందని కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. కట్టిన డీడీలు ఇవ్వాలని అడిగితే దాట వేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటానని ఏఈ రైతులకు హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం అందజేత



తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న అటెండర్‌ జాఫర్‌ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం బాధిత కుటుంబాన్ని ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్లు పరామర్శించి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పరమేశ్వర్‌రెడ్డి, నజీర్‌, ఈశ్వర్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

తెలకపల్లి: మాజీ వైస్‌ ఎంపీపీ నరేందర్‌గౌడ్‌ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్‌ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి గురువారం రాకొండలో ఆయనను పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సింగిల్‌ విండో వైస్‌ చైర్మన్‌ మామిళ్లపల్లి యాదయ్య, బాలగౌడ్‌ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్‌ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్‌: కొల్లాపూర్‌ పట్టణ కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్‌ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సయ్యద్‌, కార్తీక్‌ డిమాండ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో గురువారం వారు నిరసన తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని ఈ నెల 14న ప్రేమపేరుతో అదేపాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నిరంజన్‌ బయటికి తీసుకెళ్లినా ప్రిన్సిపాల్‌ పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్తీక్‌, నాయకులు సుల్తాన్‌, తరుణ్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ గంగమోహన్‌లు కోరారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గ్రామాల్లో పనులను గుర్తించి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసి విడతల వారిగా పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలనవారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. సమావేశంలో వైస్‌ ఎంపీపీ శివలీల, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అచ్చంపేట రూరల్‌: పట్టణంలోని బాలసదన్‌ చిన్నారులకు గురువారం ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ నాగర్‌కర్నూల్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్‌ సొసైటీ జిల్లా సెక్రెటరీ రమేష్‌ రెడ్డి మాట్లాడుతూ బాలసదన్‌ పరిధిలోని 50 మంది చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. అలాగే లెనిటీ ఫౌండేషన్‌లోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీధర్‌, కుమార్‌, అశోక్‌ ప్రసాద్‌, లోక్య నాయక్‌, కృష్ణారావు, హన్మంత్‌, ప్రసన్న, సుదర్శన్‌ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచ్‌ అంజినాయక్‌ గురువారం సీఐ సోమనర్సయ్యకు రూ.25 వేలు విరాళంగా అందజేశారు. గ్రామాల్లో చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. దాతలు ముందుకు రావాలని కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కందనూలు: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ మహేందర్‌ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంజాయి, డ్రగ్స్‌ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్‌ షాజహాన సుల్తానా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ సమాజాన్ని నిర్మిద్దాం

నాగర్‌కర్నూల్‌రూరల్‌: సమ సమాజం నిర్మాణం కోసం అందరూ పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ అన్నారు. గురువారం పట్టణంలో అభ్యుదయ రచయితల సంఘం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ఫాసిజం, అవినీతి, కులతత్వం, మూఢనమ్మకాలను అభ్యుదయ సాహిత్యం, రచనలతో నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్‌ ఆనంద్‌జీ, కల్వకోలు మద్దిలేటి, బొడ్డుపల్లి సాయి, శంకరాచారి, తలారి మద్దిలేటి, ఎస్‌ ఈశ్వర్‌ పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల సమ్మేళనం

కందనూలు/కల్వకుర్తి రూరల్‌: నాగర్‌కర్నూల్‌ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌, కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నవయువ ఓటర్ల సమ్మేళనాన్ని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా పాల్గొని దేశవ్యాప్తంగా నమోదైన నవ ఓటర్లకు మార్గదర్శకం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బంగారు శృతి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు అఖిలాష్‌రెడ్డి, మల్లేష్‌ యాదవ్‌, పర్వతాలు, లక్ష్మీకాంత్‌, చందు, పాల్గొన్నారు.

తొలుచు పురుగును నివారించాలి

తెలకపల్లి: వరిపంటలో కాండం తొలుచు పురుగును నివారించాలని రావేఫ్‌ విద్యార్థులు రైతులకు సూచించారు. తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లిలో గురువారం రాజేంద్రనగర్‌ వ్యవసాయ కళాశాల విద్యార్థులు వరిపంట సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఆకు కొనల్లో కాండం తొలుచు పురుగు గుడ్లు పెడుతుందని.. కొనలను తుంచడం వల్ల కాండం తొలుచు పురుగు సంఖ్యను తగ్గించుకోవచ్చన్నారు. పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. ఏ సమయంలో వరి విత్తుకోవాలి.. ఎలాంటి మందులు పిచికారీ చేయాలి.. తెగుళ్ల నివారణ చర్యలు వంటి వాటిపై అవగాహన కల్పించారు.